

ఒక వ్యక్తి ఒక ఆలోచన కోసం చనిపోవచ్చు, కానీ , ఆ ఆలోచన తన మరణం తర్వాత, వెయ్యి మంది జీవితాల్లో అవతరిస్తుంది.
- సుభాష్ చంద్రబోస్

# జనస్వరం

అక్షరమే ఆయుధం ✍

www. Janaswaram.com



## పాఠకులకు విజ్ఞప్తి :

జనస్వరం న్యూస్ తెలుగు దినపత్రికలో తక్కువ ఖర్చుతో ఎక్కువ పబ్లిసిటీ కొరకు అడ్వర్టయిజ్మెంట్ జన్మదిన శుభాకాంక్షలతో పాటు మరియు ఇతర అన్ని రకముల కార్య క్రమాలతో వగైరా ప్రకటనలు ఇవ్వండి. మరిన్ని వివరములకు మా మెయిల్ ఐడి janaswaramnews@gmail.com ను సంప్రదించండి.




సంపుటి : 01 సంచిక : 04 ఎడిటర్ : నరేష్ సాకె వారసంచిక ( 02-08-2020 ) పేజీలు : 6

janaswaramNEWS 9642067900


## ముందు ప్రజల ప్రాణాలు కాపాడండి.

### మూడు రాజధానులకు ఇది సమయం కాదు




న్యూస్ ( జనస్వరం ) : ప్రజలను కరోనా మహమ్మారి పట్టి పీడిస్తున్న నేపథ్యంలో మూడు రాజధానులపై నిర్ణయానికి ఇది సరైన సమయం కాదని జనసేన పార్టీ అభిప్రాయపడుతోంది. గుజరాత్ రాజధాని గాంధీ నగర్, ఛతీష్ ఘడ్ రాజధాని రాయపూర్ ను సుమారుగా మూడున్నర వేల ఎకరాల లోపే నిర్మించడం చూశాం. అమరావతిని కూడా అంతే విస్తీర్ణంలో నిర్మించమని అప్పటి తెలుగుదేశ ప్రభుత్వంకు నాటి మేధావులు, నిపుణులు చెప్పిన విషయాన్ని పెడ చెవిన పెట్టారు. అప్పటి ప్రభుత్వం రాజధాని కోసం 33 వేల ఎకరాలను రైతుల దగ్గర నుంచి సేకరించింది. అద్భుతమైన రీతిలో నిర్మించడానికి 33 వేల ఎకరాలు కావాల్సిందేనని అప్పటి ప్రతిపక్ష, నేటి అధికార పక్ష నాయకుడు ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్ గారు శాసనసభలో చాలా గట్టిగా మాట్లాడారు. ఈ మెగా రాజధానిని తరువాత వచ్చే ప్రభుత్వాలు ( వివరాలు 3లో )

## తెనాలి కోవిడ్ ఆసుపత్రి స్టాఫ్ నర్సులకు కోవిడ్ కిట్లను అందించిన స్థానిక మరియు వల్లభనేని జనసైనికులు



గుంటూరు ( జనస్వరం ) : గుంటూరు జిల్లా తెనాలి కోవిడ్ ఆసుపత్రిలో ఫ్రంట్ లైన్ వారియర్స్ అయిన నర్సులు ఆందోళనకు దిగారు. మీడియా సాక్షిగా నిరసన వ్యక్తం చేశారు. ప్రాణాలకు తెగించి కరోనా రోగులకు చికిత్స అందిస్తున్నా, తమకు కనీస స్వీయ రక్షణ పరికరాలు సైతం ప్రభుత్వం ఇవ్వడం లేదని ఆరోపించారు. నర్సులు ఆందోళనకు దిగినా వైసీపీ ప్రభుత్వం గానీ, ఆ పార్టీ నాయకులు గానీ స్పందించ లేదు. అయితే జనసేన పార్టీ మాత్రం యుద్ధప్రాతిపదికన స్పందించింది. నర్సుల ఆందోళన గురించి తెలుసుకున్న వెంటనే పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ శ్రీ నాదెండ్ల మనోహర్ గారు వారి సమస్యలు తీర్చాలని, పీపీఇ కిట్లు, శానిటరీ సామాగ్రి అందచేయాలని ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. తెనాలి కోవిడ్ ఆసుపత్రిలో ( వివరాలు 4లో )

## సాగునీరు అందించాలని కోరుతున్న జనసైనికులు.



ఎచ్చర్ల ( జనస్వరం ) : ఎచ్చెర్ల నియోజకవర్గంలో , లావేరు మండలం, మరియు ఎచ్చెర్ల జి. సిగడాం, పొందరు ఆనుకొని ఉన్న మడ్డువలస కుడి కాలువ నుండి వస్తున్న సాగు నీరు గత కొన్ని సంవత్సరాలుగా రాకపోవడం వల్ల చాలా గ్రామాల రైతులు సుమారుగా 5వేల కుటుంబాలు ఈ రిజర్వాయర్ పై ఆధారపడి బతకడం జరుగుతుంది. సుమారుగా 6వేల ఎకరాలకు సాగు నీరు లభిస్తుంది. వీరికి జీవనోపాధి లేక వలసలు కూడా వెళ్లిపోవడం జరుగుతుంది. ఈ యొక్క సమస్యను ఎచ్చెర్ల నియోజకవర్గ జనసేన నాయకురాలు శ్రీమతి శ్రీ కాంతిశ్రీ గారు మరియు చిరంజీవి యువత అధ్యక్షులు డా. విశ్వక్షేన్ గారికి దృష్టికి జనసేన నాయకులు శ్రీనివాసరావు, అర్జున్ భూపతి, హర్షా గారు తీసుకురావడం జరిగింది. ( వివరాలు 3లో )

## కరోనా బారిన పడకుండా ఉండేందుకు తమ గ్రామాన్ని శానిటైజేషన్ చేసిన జనసైనికులు.

గుంటూరు ( జనస్వరం ) : గుంటూరు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గం కుంకలగుంట గ్రామంలో కరోనా పాజిటివ్ కేసులు నమోదు అవ్వగా, ఆ గ్రామాన్ని శానిటైజేషన్ చేయడానికి ప్రభుత్వ అధికారులు చొరవ చూపలేదు. ఈ గ్రామంలోని జనసైనికులు తమ స్వంత నిధులతో బ్లీచింగ్ పౌడర్ చల్లడానికి ( మిగతా 4లో )



# అ ఆ ఇ ఈ....

## మాతృ భాషలోనే బోధన జయప్రదం : పవన్ కళ్యాణ్

### పవన్ కళ్యాణ్ గారు 2019 లో చెప్పిందే పరిగణలోకి తీసుకొని ఇప్పుడు అమలు చేశాం : కేంద్ర హెచ్.ఆర్.డీ మంత్రి రమేశ్ నిషాంక్



న్యూస్ ( జనస్వరం ) : ఐదో తరగతి వరకూ విద్యాబోధన మాతృ భాషలోనే ఉండాలని నూతన విద్యావిధానంలో కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడాన్ని జనసేన పార్టీ ఆహ్వానిస్తోందని జనసేన పార్టీ అధినేత శ్రీ పవన్ కళ్యాణ్ గారు స్వాగతించారు. గతంలో వైసీపీ ప్రభుత్వం తెలుగు మీడియం రద్దు చేసి, ఆంగ్ల మాధ్యమాన్ని తప్పనిసరి చేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని జనసేన పార్టీ వ్యతిరేకించడం చూశాం. అయితే జనసేన పార్టీ ఆంగ్ల మాధ్యమానికి ఏమాత్రం కూడా వ్యతిరేఖం కాదు అని చెప్పినా, ఆ విషయాన్ని ప్రతిపక్షాలు వ్యతిరేకించాయి. నిజానికి జనసేన పార్టీ తమ పిల్లల భవిష్యత్తుని ఏ మీడియంలో చదివించాలో అది తల్లిదండ్రుల నిర్ణయం అని జనసేన పార్టీ వక్కాణించింది. ఇంగ్లీష్ మీడియం అనేది కేవలం ఒక ఆప్షన్ గా ఉండాలి అని గతంలో జనసేన పార్టీ చెప్పింది. ( మిగతా 3 లో )

## దహన సంస్కారాలు చేసి మానవత్వాన్ని చాటుకున్న జనసైనికులు

గుడివాడ ( జనస్వరం ) : ఈ కరోనా విపత్కర సమయంలో సామాన్యులు ఆర్థికంగా క్షీణించడమే కాకుండా, కరోనా ధాటికి జీవితాలు చిన్నా భిన్నం అవుతున్నాయి. ఈ కరోనా సంక్షోభంలో ఇంట్లో వారు మరణిస్తేనే దహన సంస్కారాలు చేయాలంటే భయపడుతున్నారు. అలాంటిది జనసేన మానవత్వాన్ని (మిగతా 6లో)



## ముత్యాల ఎత్తిపోతల పథకానికి సంబంధించి సమాచారం అందించాలని మేధావులని, నిపుణులని కోరుతున్న జనసైనికులు.

జగ్గయ్యపేట ( జనస్వరం ) : జగ్గయ్యపేట నియోజకవర్గంలో, పట్టణంలో స్థానిక బైపాస్ రోడ్ వద్ద, గత ప్రభుత్వ హయాంలోఎన్నికలు సుమారుగా 3 నెలలు ముందు ఉన్న సమయంలో అనేక మంది రైతులతో ముత్యాల ఎత్తిపోతల పథకం అనే కార్యక్రమానికి అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు గారు శంఖుస్థాపన చేయటం జరిగింది. మరీ ఈ రోజున జనసేన పార్టీ తరుపున గత ప్రభుత్వాన్ని ఒకటే మాట అడుగుతున్నాము మీరు చేపట్టిన ఈ కార్యక్రమం అనేది ఏ విధంగా ఈ నియోజకవర్గ రైతులకి ఉపయోగపడింది, ఎంత మంది రైతులు ఇప్పటికి మీరు చేపట్టిన ఈ పథకం మీద ఆధారపడి ( వివరాలు 3లో )

## అధికారులకు ఫేస్ కవర్లు పంపిణీ చేసిన జనసైనికులు



లావేరు ( జనస్వరం ) : మన ఆంధ్ర రాష్ట్రంలో రోజు రోజుకి కరోనా కేసులు విపరీతంగా పెరుగుతున్నాయి. ప్రజలు కూడా బయటకు రావాలన్నా భయపడుతున్న సందర్భం. ఇటువంటి పరిస్థితుల్లో కూడా పోలీసులు, డాక్టర్లు కూడా కరోనాను లెక్క చేయకుండా తమ కార్యక్రమాలను ప్రజలకు ( మిగతా 4లో )

## సంపాదకీయం

# ఏది రాజధాని ? ఎవరి రాజధాని ?

ఇప్పుడు రాష్ట్రంలో ఎక్కడ చూసిన చర్చిస్తున్న అంశం "రాజధాని తరలింపు - మూడు రాజధానులు" , అసలు తెలుగు ప్రజలు రెండు రాష్ట్రాలుగా విడిపోయి, వేర్వేరు రాజధానులు అని తీర్మానించుకున్నాక మళ్ళీ ఇప్పుడు కొత్తగా 5 ఏళ్ళ తరువాత ఈ రాజధాని గొడవ ఎందుకు తెరమీదకి వచ్చింది? ఇది ప్రజల సౌకర్యం కోసమా లేక పాలకుల వ్యాపారం కోసమా? లేక ఆంధ్ర రాష్ట్రము ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల నుండి ప్రజల దృష్టి మరల్చే ప్రయత్నమా? అసలు ఏది రాజధాని - ఎవరి రాజధాని అనేది ఒకసారి చర్చించుకుందాం.

2014 ముందు వరకు జరిగిన విషయాలు అందరికి తెలిసినవే, వాటి గురించి మళ్ళీ ప్రత్యేకంగా చర్చించాల్సిన అవసరం లేదు. 2014 ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజధానిగా ఉన్న హైద్రాబాద్ మహానగరాన్ని పది సంవత్సరాల పాటు నూతన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రాజధానిగా ఉపయోగించుకోవడానికి సర్వ హక్కులు ఇచ్చింది. అయితే తెలంగాణ రాష్ట్ర శాసన మండలి ఎన్నికల సందర్భంగా నాటి ఆంధ్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు ఓటుకు నోట్ కేసులో అడ్డంగా దొరికిపోవడంతో, తన తప్పులు కప్పిపుచ్చుకునేందుకు, ఉన్నపళంగా రాజధానిపై హక్కులను వదిలేసుకొని ఆంధ్రరాష్ట్రానికి పారిపోయి వచ్చారు.

ఆ తరువాత ప్రపంచస్థాయి రాజధాని, సింగపూర్, లండన్ , ఇస్తాంబుల్ అంటూ కల్లబొల్లి కబుర్లు చెప్పి రైతుల నుండి దాదాపు 33 వేలఎకరాల మూడు పంటలు పండే భూమిని "ప్రజా రాజధాని అమరావతి" కోసం ప్రభుత్వం సేకరించింది. ఆ తరువాత నిర్మాణం సంగతి పక్కన పెట్టి వేలాది కోట్ల ప్రజాధనాన్ని 3D బొమ్మలు చూపిస్తూ ప్రజల్ని మభ్యపెడుతూ నామమాత్రపు నిర్మాణాలు, తాత్కాలిక భవనాల నిర్మాణం చేశారు. ఇంత జరుగుతుంటే అప్పటి ప్రతిపక్షంలో ఉన్న వైసీపీ నాయకులూ ఎవరూ కూడా జరుగుతున్నా తప్పులను అడ్డుకునే ప్రయత్నం చేయకుండా, అమరావతి నిర్మాణానికి సంపూర్ణ మద్దతు తెలియజేసారు. రాజధాని నిర్మాణం వెనుక లోటు పాట్లు ఎవరు కూడా చర్చించలేదు సరి కదా ఈ రాజధాని ముసుగులో సరికొత్త భూ దందాను ఇరుపార్టీల నాయకులూ నడిపారు.


ఇంతలో రాష్ట్రంలో ఎన్నికలు రావడం టీడీపీ ఘోర పరాజయం పొందటం, వైసీపీ తిరుగులేని విజయాన్ని సాధించడం జరిగింది.

### నూతన ప్రభుత్వం ముందు ఉన్న సవాళ్లు:

అస్తవ్యస్తంగా ఉన్న రాజధాని నిర్మాణాన్ని క్రమపద్ధతిలో నిర్మించడం. గత ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవడం. అభివృద్ధిని ఒక్క రాజధాని ప్రాంతానికి మాత్రమే పరిమితం కాకుండా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు వికేంద్రీకరణ జరిపించడం ప్రభుత్వం యొక్క లక్షణం.

### మరి వైసీపీ ప్రభుత్వం చేస్తున్నది ఏమిటి?

ఒక్క రాజధాని నిర్మాణానికే దిక్కు తోచని స్థితిలో ఉన్న ఆంధ్రప్రదేశ్ ని 3 రాజధానులు అంటూ రాష్ట్ర భవిష్యత్తుని అగమ్యగోచర స్థితికి తీసుకెళ్లాడు. ఈ నిర్ణయం తీసుకోవడమే ఆలస్యం అప్పటివరకు రాష్ట్రంలో పెట్టుబడులు పెడుతామని వచ్చిన ఎన్నో బహుళజాతి కంపెనీలు ఇంతటి అస్తవ్యస్త నిర్ణయాలు తీసుకునే రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టలేమంటూ వెనక్కి వెళ్లిపోయాయి. రాజధాని నిర్మాణం జరిగితే తమ బిడ్డలా భవిష్యత్తు బాగుపడుతుందని ఉన్న కొద్దిపాటి భూమిని ప్రభుత్వానికి ఇచ్చిన రైతులు రోడ్డపాలయ్యారు. దాదాపుగా 230 రోజుల ధర్నా ఎటుకాకుండా అయిపోయింది. ఇపుడు 33 వేల ఎకరాల పంట పండే భూమిని అధోగతి అయ్యేలా చేశారు. యువతకు తమ భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకున్నాయి.




### అసలు ఈ మూడు రాజధానుల నిర్మాణం ఎందుకు? అసలు దీని వెనుక ఉన్న కథ ఏంటి?

ఆంధ్రప్రదేశ్ రాజధానిని మూడు భాగాలుగా విభజిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బిల్లు తీసుకొచ్చింది, అవి :

- లెజిస్లేటివ్ క్యాపిటల్
- అడ్మినిస్ట్రేటివ్ క్యాపిటల్
- జ్యుడీషియరీ క్యాపిటల్

అసలు ఈ మూడు రాజధానుల గురించి కూలంకషంగా చర్చిస్తే వీటివల్ల కలిగే మేలు కంటే కీడే ఎక్కువ అనేది మేధావుల మాట. అదెలాగో చూద్దాం.

**లెజిస్లేటివ్ క్యాపిటల్:** ప్రపంచ స్థాయి రాజధాని నిర్మాణం జరుగుతుంది, తమ జీవితాలు బాగుంటాయి, అన్ని ప్రాంతాల ప్రజలకు అనుసంధానానికి అనువుగా ఉంటుంది అని రైతులు దాదాపు 33 వేల ఎకరాల సారవంతమైన భూమిని ప్రభుత్వానికి ఇచ్చారు. ప్రజలు ఒక రాజకీయ పార్టీకి కాకుండా ప్రభుత్వానికి రాసిచ్చారు. మరి ఉన్నపళంగా ఇక్కడ కేవలం శాసన సభ మాత్రమే ఉంటుంది. ఇంకేం ఉండదు అని అంటే మరి 33 వేల ఎకరాల భూమిని గత ప్రభుత్వం తీసుకుంటున్నప్పుడు వైసీపీ నేతలు ఎందుకు వ్యతిరేకించలేదు? అసలు శాసన సభ నిర్మించడం వాళ్ళ అది రాజధాని అయిపోతుందా? అక్కడేమైనా లక్షలాది ఉద్యోగాల కల్పనా జరుగుతుందా? నాయకులూ కాలక్షేపానికి ఉపయోగించుకునే విడిది ఇల్లు కోసం 33 వేల ఎకరాలు భూమి, లక్షలాది మంది రైతుల ఆశలు, 5 కోట్ల మంది ప్రజల జీవితాలను పణంగా పెడతారా? ఈ రాజధాని వాళ్ళ ఎవరికీ పైసా ఉపయోగం లేదు, లెజిస్లేటివ్ క్యాపిటల్ ఒక చోట ఉన్నంత మాత్రాన పరిపాలన అస్తవ్యస్తంగా జరుగుతుందని అనేది మేధావుల మాట.

**అడ్మినిస్ట్రేటివ్ క్యాపిటల్:** స్వతహాగా పారిశ్రామికంగా, పర్యాటకంగా, విద్యారంగం, చిత్ర పరిశ్రమ, రక్షణ శాఖలతో దశాబ్దాలుగా ఎంతో ఆర్థిక ప్రగతిని సాధించి ఇప్పటికే ఆర్థిక రాజధానిగా పేరుపొందింది. అయితే ఇక్కడ ఉన్న ప్రకృతి వనరులపైకన్ను పడ్డ వైసీపీ నేతలు గతంలో ఇక్కడ రాజధాని వస్తుందేమో అనే యోచనతో విచ్చల విడిగా భూములు దోచుకున్నారు, అయితే రాజధాని అమరావతికి వెళ్లడంతో ఎలా అయినా సరే ఇక్కడ మళ్ళీ భూదందా మొదలు పెట్టాలనే సంకల్పంతో ఇక్కడకు "పరిపాలనా రాజధాని" తీసుకొస్తున్నాం అని ప్రచారం చేసి ఉన్నపళంగా ఇక్కడ భూముల ధరలు, అద్దెలు ఆకాశాన్ని చేరుకునేలా చేసి సామాన్యుడి నడ్డి విరుస్తున్నారు. అసలు పాలన రాజధాని వల్లా ప్రత్యేకంగా విశాఖకు ఒరిగేది ఏమి లేదు.అనేది ప్రజలు చెబుతున్న మాట. ప్రశాంతంగా ఉండే విశాఖకు పాలన రాజధాని రావడం వల్ల, ఒక సచివాలయం భవనం, మంత్రుల నివాస సముదాయాలు తప్ప ప్రత్యేక అభివృద్ధి కానీ, నూతన పరిశ్రమలు కానీ రావు, అటువంటప్పుడు ఈ రాజధాని వల్ల వచ్చే ప్రయోజనం శూన్యం, అదీ కాకుండా మంత్రులంతా ఇక్కడ కాన్వాయ్ లో తిరుగుతూ ప్రజలకు అనవసరమైన ట్రాఫిక్ కష్టాలు, ధరల పెరుగుదల, రియల్ ఎస్టేట్ దందాలు, రౌడీ రాజకీయాలు పెరుగుతాయని సగటు వైజాగ్ వాసి భయభ్రాంతులకు లోనవుతున్నారు.

**జ్యుడీషియరీ క్యాపిటల్:** హై కోర్ట్ ఏర్పాటు చేయడాన్ని రాజధాని అని ఏ విధంగా అంటారో, దీని వల్ల ప్రత్యేకంగా కర్నూల్ ప్రాంతంలో ఏ అభివృద్ధి జరుగుతుందో ఆ జగన్ రెడ్డి కే తెలియాలి. హై కోర్ట్ ఏర్పాటు అనేది దశాబ్దాలుగా కర్నూల్ ప్రజల ఆకాంక్ష. అయితే హై కోర్ట్ పెట్టుకోవడంలో తప్పు లేదు కానీ దాన్ని ఏ విధంగా రాజధానిగా పరిగణిస్తారు అంటే సమాధానం లేదు. ఎక్కడెక్కడి నేరస్థులు, పోలీసుల రాక తప్ప ఏ పరిశ్రమ కానీ, సంస్థలు కానీ వస్తాయని చెప్పే ధైర్యం ఎవ్వరు చేయలేదు. మరి ఈ జ్యుడీషియరీ క్యాపిటల్ వల్ల సీమ కరువు తీరుతుందా? సీమ వెనుకబాటుతనం తీరుతుందా? మరి ఏ ఉద్దేశంతో దీనిని రాజధాని అంటారు? ఇలా ఏ విధంగా చూసినా మూడు రాజధానుల వల్ల ప్రజలకు కానీ ఆయా ప్రాంతాలకు కానీ ఒరిగేది ఏమి లేదు, కేవలం మళ్ళీ బాగుపడేది రాజకీయ నేతలు, వారి బంధువులు మాత్రమే.

### రాజధాని అంశంపై రాజకీయ పార్టీల మాటలు ఏంటి?

తెలుగుదేశం: నాడు అవసరం లేకపోయినా 33 వేల ఎకరాల భూసేకరణ చేసి భవిష్యత్తులో ప్రభుత్వాలు మారినా సరే నిర్ణయం మారకుండా, రైతులకు భరోసా కల్పించే పనులు చేయలేదు. వీరు చేసిన దోపిడీల వలన, ఒక వర్గానికి భూములను దోచిపెట్టడం, ఇన్ సైడర్ ట్రేడింగ్ అనేది రాజధాని తరలింపుకు ప్రధమ కారణంగా అందరూ చెబుతున్నారు. రాజధాని పై ఆంధ్రులను మోసం చేసిన వారిలో ముందు వరసలో వీరు ఉంటారు.

వైసీపీ: నాడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రాజధానికి సంపూర్ణ మద్దతు ఇచ్చారు, 33 వేల ఎకరాలు కావాలని అసెంబ్లీ సాక్షిగా ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్ రెడ్డి చెప్పారు. అధికార , ప్రతిపక్షాలు ఇద్దరు ఏకాభిప్రాయానికి రావడంతో ప్రజలు కూడా భవిష్యత్తుపై భరోసాతో రైతులు త్యాగం చేసారు. ఆనాడు వైసీపీ నాయకులూ అధికార వికేంద్రీకరణ, అభివృద్ధి వికేంద్రీకరణ ఊసెత్తలేదు. ఈరోజు ఉన్నపళంగా వైసీపీ నిర్ణయం మార్చడం వల్ల లక్షలాది రైతులు, ప్రజలు రోడ్డున పడ్డారు. ఇది జగన్ రెడ్డి చేసిన చారిత్రాత్మక తప్పిదంగా భావించవచ్చు.

జనసేన: జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మొదటి నుంచి రాజధానిపై రైతులతో, అప్పటి ప్రభుత్వంతో సలహాలు, సంప్రదింపులు జరుపుతూ జరుగుతున్నా తప్పులను, తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఎప్పటికప్పుడు చెప్తూ వచ్చారు. అన్ని వేల ఎకరాలు అవసరం లేదని మాట్లాడిన ఏకైక వ్యక్తి, కానీ ఆరోజు వైసీపీ కనీసం నోరెత్తలేదు. అలాగే భవిష్యత్తులో అధికారంలో ఎవరున్నా సరే ఇక్కడి రైతులకు అన్యాయం జరగకూడదు అని ప్రభుత్వం నుంచి బాకీ పత్రం కూడా ఇవ్వాలని చెప్తే నాటి టీడీపీ ప్రభుత్వం స్పందించలేదు. అలాగే ఈరోజు కూడా అయన పాలన ఒకచోట, అభివృద్ధి అన్ని చోట్లా అని ఒకే నిర్ణయంపై నిలబడ్డారు.

జరుగుతున్నా పరిణామాలు చూస్తే ఇది కేవలం అధికార వికేంద్రీకరణ తప్ప ఎటువంటి అభివృద్ధి వికేంద్రీకరణ కూడా జరగటం లేదు అనేది అన్ని ప్రాంతాల ప్రజలు గమనించాల్సిన విషయం. ఇలా మూడు రాజధానులు అంటూ ప్రజల మధ్య ప్రాంతీయ విద్వేషాలు రేకెత్తించడం మినహా జగన్ ప్రభుత్వం చేసిందేమి లేదు. ఇకమీద అయినా జగన్ మరోసారి తన తుగ్లక్ నిర్ణయాన్ని పునఃసమీక్షించుకొని ప్రజాభీష్టం మేరకు పాలనా చేస్తే నలుగురితో మంచి అనిపించుకుంటాడు, లేదంటే 151+2+1 మంది కలియుగ కౌరవులతో ఉన్న కురు సభ త్వరలోనే కూలిపోతుందని విశ్లేషకుల మాట.

మూడు రాజధానుల, సీ.ఆర్.డీ.ఏ రద్దు బిల్లును గవర్నరు గారు ఆమోదించిన విషయం తెలిసిందే. ఇపుడు కొన్ని సామాజిక వర్గాల వారు, ఆ వర్గాలకు చెందిన కొన్ని ప్రముఖ మీడియా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఎక్కడ అంటూ దుమ్మెత్తి పోస్తున్నారు. పవన్ కళ్యాణ్ గారు ఆనాడే చెప్పారు రాజధాని నిర్మాణానికి అన్నీ వేల భూములు అవసరం లేదని, అలాగే ఇప్పుడు ఉన్న ప్రభుత్వం అన్నీ వేల ఎకరాల భూములు రైతుల దగ్గరి నుంచి తీసుకుంటే, మళ్ళీ ఇంకొక ప్రభుత్వం వచ్చి రాజధాని మారుస్తాం అంటే అపుడు రైతులకు ఏమి సమాధానం చెప్తారు? అని పవన్ కళ్యాణ్ గారు ప్రశ్నించారు.

BY
@TylerDurden
From @sainikaswaram ( Twitter)
Website : https://sainikaswaram.wix-site.com/

## మాతృభాషలోనే బోధన జయప్రదం

( మొదటి పేజీ తరువాయి )

ఈ విషయాన్ని అప్పటి ప్రతిపక్షాలు జనంలోకి తప్పుగా తీసుకెళ్లి జనసేన పార్టీ మీద తప్పుడు విధానం కలిగేలా చేశారు. జనసేన పార్టీ కూడా ఈ విషయాన్ని అనేక భాషావేత్తలతో, మేధావులతో, విద్యారంగంలో అపార అనుభవం ఉన్న నాయకులతో చర్చించి ఈ నిర్ణయం తీసుకోవడం జరిగింది. ఒకానొక సందర్భంలో మాతృ భాషలో భోధనలు జరిగినప్పుడు గొప్ప ఫలితాలు ఆవిష్కరణ అవుతాయని ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థ అయిన యునెస్కో 2008 వ సంవత్సరంలో ప్రకటించింది. అనేక సంవత్సరాలు పరిశోధన చేసిన తర్వాత యునెస్కో ఈ విషయాన్ని ప్రకటించింది.

ఈ నేపథ్యంలో జనసేన పార్టీ తమ వంతు బాధ్యతగా భావితరాల పిల్లల భవిష్యత్తుని దృష్టిలో పెట్టుకొని నిర్ణయం తీసుకొంది. తెలుగు మాధ్యమాన్ని ఉంచాలని పోరాడింది. అలాగే విద్యావిధానాల మీద కొన్ని నిర్ణయాలు అప్పట్లో పవన్ కళ్యాణ్ గారు ప్రకటించడం జరిగింది. ఆ నిర్ణయాలను ఇపుడు కేంద్ర ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవడం గమనార్హం. ఇపుడు కేంద్ర ప్రభుత్వం కొత్త విద్యావ్యవస్థలో భాగంగా కొన్ని మార్పులు తీసుకోవడం జరిగింది. అందులో గతంలో పవన్ కళ్యాణ్ గారు సూచించిన విద్యా విధానాలను పరిగణలోకి తీసుకున్నామని, ఆ విద్యా విధానాలు విద్యార్థులకు ఎంతో సహకరిస్తాయని కేంద్ర క్యాబినెట్ మానవ శాఖ వనరుల మంత్రి శ్రీ రమేశ్ ఫోఖ్రియాల్ నిశాంక్ గారు తెలియజేశారు.

" జాతీయ విద్యా విధానం 2020 రూపకల్పనలో జనసేన పార్టీ ఆలోచనలను పొంది పరిచినందుకు ధన్యవాదాలు తెలుపుతూ, ఈ చర్య ప్రేరణాత్మకమైనదని, ఇది భారతదేశ అన్ని రంగాల్లో రాణించడానికి దోహదపడే ఎన్నో విప్లవాత్మకమైన ఆలోచనను పౌరుల్లో రేకెత్తిస్తుంది అని కేంద్ర మానవ శాఖ వనరుల మంత్రి శ్రీ రమేశ్ ఫోఖ్రియాల్ నిశాంక్ గారికి పవన్ కళ్యాణ్ ధన్యవాదాలు తెలిపాడు.

## జనసేన పార్టీకి నష్టం కలిగేలా వ్యవహరిస్తున్న కోనేటి హరి మీద తగిన చర్యలు తీసుకుంటాం : కడప జనసేన నాయకులు




కడప ( జనస్వరం) : కడప జిల్లాలో జనసేన పార్టీ పేరు చెప్పుకుంటూ కోనేటి హరి రాయల్ అనే వ్యక్తి జనసేన పార్టీకి తీవ్రమైన నష్టం కలిగించే విధంగా పార్టీ ప్రతిష్టకి భంగం కలిగించేలా వ్యవహరించడమే కాకుండా పార్టీకి నష్టం కలిగించే అనేక కుట్రపూరిత కార్య కలాపాలను చేపట్టాడు. పార్టీలో ఇతను చేస్తున్న కుట్ర వ్యవహారాన్ని పసిగట్టినటువంటి ఇక్కడి నాయకులు సదరు వ్యవహారం మొత్తాన్ని సాక్ష్యాధారాలతో సహా పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకు పోవడం జరిగింది. ఈ వ్యవహారం పై స్పందించిన పార్టీ అధిష్టానం ఈ కోనేటి హరి రాయల్ కు అధికారికంగా జనసేన పార్టీలో ఏ రకమైనటువంటి పదవి బాధ్యతలు లేవు కాబట్టి, జనసేన పార్టీలో అతను తనకు తానుగా ఉన్నటువంటి సామాన్య కార్యకర్త కాబట్టి అతని గురించి ప్రత్యేకంగా పార్టీ అధిష్టానం స్పందించవలసిన అవసరం లేదంటూనే అతని వల్ల పార్టీకి నష్టం వాటిల్లుతుంది కనుక అతని స్థాయికి తగిన విధంగా స్థానిక పార్టీ కమిటీ వారు అతనిపై చర్యలు తీసుకోవాల్సిందిగా సూచించారు. ఈ కోనేటి హరి రాయల్ వ్యవహారంలో గత సంవత్సర కాలంగా అతను చేస్తున్న ఆగడాలు, పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు, సామాజిక మాధ్యమాలలో (ఫేస్ బుక్) హద్దు మీరిన అతని వ్యవహార శైలి అన్నీ కూడా క్రమశిక్షణ కలిగినటువంటి జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, జనసైనికులు అందరూ కూడా చాలా సహనంతో ఆలోచించి అతను చేస్తున్న తప్పును సరిదిద్దేందుకు, ఆ తప్పు అతను తిరిగి చేయకుండా ఉండేందుకు అనేక ప్రయత్నాలు చేసినప్పటికీ అతడు జనసేనపార్టీ ఇంఛార్జిలను, పార్టీ నాయకులను, జన సైనికులను వారి కుటుంబ సభ్యులను వ్యక్తిగతంగా ఫేస్బుక్ వేదికగా చేసుకొని నీచమైన భాష ప్రయోగిస్తూ దూషించడం మొదలుపెట్టడం జరిగింది. ఇకపై ఈ కోనేటి హరి రాయల్ చేస్తున్న దుష్క్రియల కారణంగా పార్టీకి నష్టం కలగకుండా కాపాడుకునేందుకు పార్టీ యొక్క, పార్టీ నాయకుల యొక్క ప్రతిష్టను, గౌరవాన్ని కాపాడుకునేందుకు ఈ కోనేటి హరి రాయల్ గురించి అతని పార్టీ వ్యతిరేక కార్యక్రమల గురించి అధిష్టానం ఇచ్చిన సూచన మేరకు ఈ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి అతడికి జనసేన పార్టీతో ఏ రకమైనటువంటి సంబంధం లేదు అన్న విషయాన్ని స్పష్టం చేస్తున్నాము. కావున జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు జనసైనికులు, ప్రజలందరూ ఈ విషయాలను గమనించి మెలగాలని కడప జనసేన నాయకులు కోరారు.

## అర్ధరాత్రిలో స్థానికులను హడలెత్తిస్తున్న అధికార యంత్రాంగం.



సర్వేపల్లి (జనస్వరం ) : సర్వేపల్లి నియోజకవర్గం మనుబోలు వెంకన్నపాలెం గ్రామంలో అర్ధరాత్రి పూట స్థానికులను హడలెత్తిస్తున్న అధికార యంత్రాంగం. వివరాల్లోకి వెళ్తే నవరత్నాలకై యస్.సి, యస్.టిల స్థలాలు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా భూ సేకరణ వివాదంలో ఎమ్మార్వో గారు, అధికార యంత్రాంగం వచ్చి అక్కడి స్థానికులను రాత్రివేళ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలుసుకున్న జనసేన పార్టీ నాయకులు కిషోర్ గునుకుల అక్కడికి వెళ్లి వాళ్లకి ధైర్యం చెప్పి జిల్లా కలెక్టర్ గారి దృష్టికి, పార్టీ అధిష్టానం దృష్టికి ఈ విషయం తీసుకెళ్తానని భరోసా ఇచ్చారు. గతంలో ఈ విషయమై ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వెంకటయ్య గారి ఆరోగ్య పరిస్థితి కనుక్కొని జనసేన పార్టీ తోడుగా ఉందని, తొందరపడవద్దని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మార్వో గారిని కలిసిన కిషోర్ గునుకుల గారు పేదలపై దురుసుగా వ్యవహరించవద్దని, గత అధికారుల దౌర్జన్యంతో మనస్థాపానికి గురై ఆత్మహత్యా ప్రయత్నం చేసిన బాధితుడు ఇంకా కోలుకోలేదనీ, ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా పంచాయితీకి సంబంధించిన గ్రామదత్తం భూములను రెవెన్యూ అధికారుల పెత్తనం సబబు కాదని, అలాగే అర్ధరాత్రులు గ్రామంలో ఏమి డ్యూటీ చేస్తున్నారనీ, పేదల పట్ల న్యాయంగా వ్యవహరించాలని తెలియజేసారు.

## ముత్యాల ఎత్తిపోతల పథకానికి సంబంధించి సమాచారం అందించాలని మేధావులని, నిపుణులని కోరుతున్న జనసైనికులు.

( మొదటి పేజీ తరువాయి )

ఆధారపడి పొలం పనులు సాగిస్తున్నారు అని నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు ఈమని కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పత్రికాముఖంగా ఆయన తెలియచేసారు. ఈ కార్యక్రమంలో కిషోర్ కుమార్ మాట్లాడుతూ ఒకప్పుడు ఆంధ్ర తెలంగాణ విడిపోయిన తరువాత అప్పటి ఆంధ్రప్రదేశ్ నాయకుల పనితనం వలన కేవలం సాగర్ కి సంబంధించిన నీళ్ళుఅనేవి మిగులు జలాలు మాత్రమే ఉపయోగానికి ఇచ్చేవారని, నియోజకవర్గానికి అదే విధంగా పట్టణానికి దగ్గరలో ఉన్నటువంటి పులిచింతల ప్రాజెక్టుకి సంబంధించినటువంటి నీటిని మరీ కొంత మేర త్రాగు నీటికి, పశు గ్రాసానికి ఉపయోగించుకోవచ్చని, ఉపయోగించుకుంటున్నారని, మరి కొంత నీటిని లిఫ్ట్ ఇరిగేషన్స్ ద్వారా వ్యవసాయానికి సంబంధించి కాలువ ద్వారా, చెరువుల ద్వారా మెట్ట ప్రాంతానికి సంబంధించినటువంటి రైతులకి అందించే అవకాశాలు ఉన్నాయని, మరీ ముఖ్యంగా ఈ పథకం ద్వారా నియోజకవర్గానికి సంబంధించినటువంటి అనేక మంది రైతులు ప్రస్తుత పంట కన్నా ఎక్కువ పంట వేసుకునే అవకాశం ఉందని ఆయన తెలిపారు. కేవలం గత ప్రభుత్వం లో టీడీపీ వారు ఎన్నికలు ముందు ఉన్న సమయాన ఆర్భాటంగా ఎన్నికల స్టంట్ ఉపయోగించి ప్రజలను, రైతులని మభ్యపెట్టి, వారు చేపట్టిన ఈ పథకం అనేది ఏ మాత్రం క్రియాశీలకంగా లేదు అని ఆయన తెలిపారు. మీరు రైతుల గురించి ఆలోచించేవారు ఐతే, రైతులకి న్యాయం చేయాలి అంటే ఒక ధవళేశ్వరం బ్రిడ్జి, ఒక ప్రకాశం బ్యారేజ్ లాంటివి నిర్మించిన బ్రిటిష్ సర్ ఆర్థర్ కాటన్ లాంటి వ్యక్తులని స్ఫూర్తి గా తీసుకుని భారతదేశం యొక్క వెన్నుముక లాంటి రైతులకి వందేళ్లు గుర్తుండిపోయేలా కార్యక్రమాలు చేయాలనీ ఆయన తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం అయినా దీని మీద దృష్టి సారించి, దీని మీద చొరవ చూపించి, రైతులకి ఉపయోగకరంగా ఉండాలని, దీనిని ముందుకి తీసుకెళాలని, అదే విధంగా దీనికి సంబంధించి పూర్తి విచారణ, రిపోర్ట్ జనసేన పార్టీ తరుపున తయారుచేయుచున్నామని దానికి నిపుణులు, మేధావులు, రిటైర్డ్ ఉద్యోగుల సహకారం కావాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో త్రిశాంత్, నాగ, తరుణ్, పాషా తదితరులు పాల్గొన్నారు.

## సాగునీరు అందించాలని కోరుతున్న జనసైనికులు.

( మొదటి పేజీ తరువాయి )

ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు పైడిరాజు, దుర్గారావు, శ్రీను, బాబాజీ, సింహాచలం, జయప్రకాశ్, నికిల్, అమీర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమస్య పై వెంటనే రిజర్వేయర్ దగ్గరకు వెళ్లి తెలుసుకొని JE సుబ్బారావు గారికి, మరియు, శ్రీకాకుళం DEE మరియు, సూపరిండెంట్ గారికి ఈ సమస్యను శ్రీమతి శ్రీ కాంతి శ్రీ గారు జనసేన కార్యకర్తలు సాగునీరు అందించాలని జనసైనికులు అధికారులని కోరారు. సాధ్యమైనంత వరకూ ఈ సమస్యను పరిష్కారం చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. జనసేన అధినేత శ్రీ పవన్ కళ్యాణ్ గారి ఆశయాలకనుగుణంగా నడుస్తామని, ఎవరికి ఏం కష్టం వచ్చినా జనసేన పార్టీ ముందు ఉంటుందని తెలియజేశారు. అలాగే భవిష్యత్తులో ప్రజల కోసం పోరాటం కోసం జనసేన నాయకులు ముందుంటామని చెప్పారు.

## ముందు ప్రజల ప్రాణాలను కాపాడండి

( మొదటి పేజీ తరువాయి )

ముందుకు తీసుకెళ్లకపోతే రైతుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించింది ఆ రోజు ఒక్క జనసేన పార్టీ మాత్రమే. రాజధానికి 33 వేల ఎకరాలు అవసరం లేదని చెప్పింది కూడా జనసేన పార్టీ మాత్రమే. ఒక ఏడాదికి మూడు పంటలు పండే సారవంతమైన భూములను తీసుకొని భవంతులు నిర్మించడం సవ్యం కాదని జనసేన పార్టీ ఆనాడే చెప్పింది. కేవలం మూడున్నర వేల ఎకరాల భూమిని సేకరించి రాజధానికి ఆపాదం చేసి, ఆపై భూములు ఇచ్చిన రైతులు ఆవేదన చెందే వారు కారు. పెద్దలు, సీనియర్ రాజకీయ వేత్తలు శ్రీ వడ్డే శోభానాద్రీశ్వర రావు గారు చెప్పినట్లు గత ప్రభుత్వం నేల విడిచి సాము చేసింది. దానికి నాడు ప్రతిపక్షంలో ఉన్న వైయస్సార్ పార్టీ వంత పాడడం చూశాం. మూడు రాజధానుల, సీఆర్డీఏ రద్దు ఈ రెండు బిల్లులను గవర్నర్ గారు ఆమోదించిన తరుణంలో ఉత్పన్నయమయ్యే రైతుల పరిస్థితిపై జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీలో నిర్ణయించి భవిష్యత్తు ప్రణాళికను రూపొందిస్తాము. రైతులకు ఏ విధమైన అండదండలు అందించాలో ఈ సమావేశంలో దృష్టి పెడతాం. రైతుల పక్షాన జనసేన తుదివరకూ పోరాడుతుందని హామీ ఇస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం రోజుకు కరోనా పదివేల కేసులు పైగా నమోదు అవుతున్న తరుణంలో ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని భయపడుతున్న సందర్భం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కనిపిస్తోంది. ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో ప్రజలను కరోనా వైరస్ బారి నుంచి రక్షించడానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు దృష్టి పెట్టాలని జనసేన పార్టీ అధినేత శ్రీ పవన్ కళ్యాణ్ గారు విజ్ఞప్తి చేశారు.

## తెనాలి కోవిడ్ ఆసుపత్రి స్టాఫ్ నర్సులకు కోవిడ్ కిట్లను అందించిన స్థానిక మరియు వర్జినీయా జనసైనికులు

( మొదటి పేజీ తరువాయి )

స్పందించిన జనసైనికులు... శ్రీ నాదెండ్ల మనోహర్ గారి సూచనల మేరకు స్థానిక జనసేన శ్రేణులు, ఎన్.ఆర్.ఐ విభాగం తరఫున 80 మంది నర్సింగ్ స్టాఫ్ కి ఒక్కొక్కరికీ లీటరు చొప్పున బ్రాండెడ్ శానిటైజర్, హెడ్ షీల్డులు, సర్జికల్ మాస్కులు, హ్యాండ్ గ్లౌజులు అందచేత. ఈ కార్యక్రమములో స్థానిక జనసేన పార్టీకి చెందిన శ్రీ జీడుగు తులసీరాం, శ్రీ ఆదినారాయణ, శ్రీ పి.మురళీకృష్ణ, శ్రీ రవికాంత్, శ్రీ రమాకాంత్ గార్లు పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎన్.ఆర్.ఐ వర్జినీయా విభాగానికి చెందిన శ్రీ వెంకట్ గారు సహకారం అందచేశారు.

## అధికారులకు ఫేస్ కవర్లు పంపిణీ చేసిన జనసైనికులు.


( మొదటి పేజీ తరువాయి )

ప్రజలకు అందించడంలో ముందున్నారు. అటువంటి అధికారులకు కూడా రక్షణ కరువు అవ్వడం చూస్తున్నాం. ఈ సందర్భంగా లావేరు జనసేన-బీజేపీకార్యకర్తలుకలసిఫ్రంట్‌వారియర్ సంస్థ పేరిట ప్రజలకు అండగా ఉంటున్న డాక్టర్లకు, పోలీసులకు ఇతర అధికారులకు ఫేస్ కవర్లు అందజేశారు. లావేరు గ్రామ జనసేన, బీజేపీ నాయకులు పోలీసు స్టేషన్, సచివాలయ కార్యాలయం, ఆశా వర్కర్లకు, వ్యవసాయ శాఖ సిబ్బందికి ఫేస్ కవర్లు అందించి ఉదారతను చాటుకున్నారు. అధికారులు, గ్రామస్తులు మాట్లాడుతూ ఇటీవన్తి సహాయం చేయడం చాలా సంతోషకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ, జనసేన నాయకులు రాజా రమేశ్, కోలా రాజేష్, రేగాన మూర్తి, బాసిన రవి, జనసేన యువకులు నవీన్, బీర నందు, కర్ర సాయి, ఉప్పు జగదీష్ బారుకుల శ్రీకాంత్, నోమీ పాల్గొన్నారు.

## చిరంజీవి సేవా సంఘం ఆధ్వర్యంలో 150 మందికి అల్పాహారం అందించిన జనసైనికులు

సూళ్ళూరు పేట ( జనస్వరం ) : శ్రేయోభిలాషి శ్రీ కోట సునీల్ కుమార్ గారి జన్మదిన సందర్భంగా సూళ్లూరుపేట పట్టణంలో రైల్వే స్టేషన్ వద్ద 50 మందికి అల్పాహారం పంపిణీ చేయడం జరిగింది, సూర్య హోటల్ కిషోర్ అన్న సహకారంతో మరియు చెంగాలమ్మ గుడి వద్ద ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న 100మంది వృద్ధులకు అల్పాహారం పంపిణీ చేయడం జరిగినది, ఈ కార్యక్రమంలో చిరంజీవి సేవా సంఘం సభ్యులు మరియు జనసైనికులు మాభాష, సీనయ్య, ప్రభు, శివకుమార్, పాల్గొన్నారు చిరంజీవి సేవా సంఘం అధ్యక్షులు మా భాష మాట్లాడుతూ ఈరోజు జన్మదినం జరుపుకుంటున్న కోట శీను కుమార్ గారికి చిరంజీవి సేవా సంఘం తరపున హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు అలాగే వంద మందికి అల్పాహారం అందజేసిన దాత కిషోర్ గారికి చిరంజీవి సేవా సంఘం తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే జనసేన అధినేత శ్రీ పవన్ కళ్యాణ్ గారి ఆశయ సాధనలో నడుస్తామని చెప్పారు.

## లాక్ డౌన్ లో నిలిచిపోయిన రష్యన్ యువతికి సహాయం చేసిన జనసేన



తిరుపతి ( జనస్వరం ) : ప్రపంచ మానవాళికి కరోనా వైరస్ ఒక మహమ్మరిలా పట్టి పీడిస్తోంది. ఈ కరోనా వల్ల సామాన్య ప్రజల నుండి ధనవంతుడి వరకూ అందరూ కూడా ఆర్థికంగా, ఆరోగ్యంగా క్షీణించారు. అయితే చాలా మంది ఈ లాక్ డౌన్ వల్ల స్వంత ప్రదేశాలకు వెళ్లకుండా ఆగిపోయిన నిరాశ్రయులెందరో... లాక్ డౌన్ ముందు తిరుమలలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దర్శనానికి రష్యన్ నుంచి ఒక యువతి తిరుపతికి వచ్చింది. ఆమె ఇక్కడకు వచ్చిన తరువాత కేంద్ర ప్రభుత్వం లాక్ డౌన్ విధించడంతో ఇక్కడే ఉండిపోయింది. అయితే తన వద్ద ఉన్న డబ్బులు కూడా అయిపోవడంతో తన స్వదేశానికి వెళ్లడానికి డబ్బులు లేక, ప్రస్తుతం తన జీవన స్థితి గడవట్లేదని సామాజిక మాధ్యమాల ద్వారా తెలియజేసింది. ఈ విషయం తెలుసుకున్న స్వదేశానికి తిరిగి వెళ్లలేక,నిలిచిపోయిన రష్యా మహిళకు సాయం చేసేందుకు ముందుకు వచ్చిన జనసేన పార్టీ నాయకులు మాసి కృష్ణ మూర్తి గారు, ఆ మహిళకు తమ స్వగృహంలో ఆతిధ్యం ఇచ్చి మరియు రష్యన్ మహిళ అమ్మ గారిని బృందావన్ నుంచి టాక్సీ ద్వారా ఢిల్లీకి తీసుకొచ్చి, అక్కడ నుంచి ఫ్లైట్ ద్వారా తిరుపతికి తీసుకువచ్చే బాధ్యత తీసుకుని వారివురుకి వసతి ఏర్పాట్లు చేసిన జనసేన పార్టీ రాయలసీమ దక్షిణ కోస్తా సంయుక్త సమన్వయ పార్లమెంటరీ సభ్యులు మాసి కృష్ణ మూర్తి గారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఏం కష్టం వచ్చినా ఆదుకోవడానికి జనసేన పార్టీ నాయకులు ఉంటారని, జనసేన అధినేత శ్రీ పవన్ కళ్యాణ్ గారి ఆశయ సాధనలో నడుస్తామని చెప్పారు.

## బయోమెట్రిక్ విధానానికి ప్రత్యామ్నాయం తీసుకురావాలి : జనసేన మురళి

న్యూస్ ( జనస్వరం ) : జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ గారి పిలుపు మేరకు రాష్ట్ర అధికార ప్రతినిధి పోతిన వెంకట మహేష్ సూచనల మేరకు నిర్వహించిన ఒక సమావేశంలో నియోజకవర్గ సమన్వయ కర్త బాడిశ మురళీకృష్ణ మాట్లాడుతూ రేషన్ షాపుల వద్ద బయోమెట్రిక్ విధానానికి ప్రత్యమ్నాయం తీసురావాలి అని రేషన్ సరుకులు తీసుకునే క్రమంలో బయోమెట్రిక్ విధానంలో వేలిముద్ర వేయవలసి ఉంటుంది. కరోనా వైరస్ వ్యాప్తి అధికంగా ఉన్న తరుణంలో బయోమెట్రిక్ శ్రేయస్కరం కాదని ప్రభుత్వ కార్యాలయంలో ఉద్యోగులు బయోమెట్రిక్ నిలుపుదల చేశారు. అదే విధంగా రేషన్ సరుకుల కోసం వచ్చే కార్డుదారులకు ప్రత్యామ్నాయం తక్షణమే అమలులోకి తీసుకు రావాలి బయోమెట్రిక్ విధానం రేషన్ కోసం ఎక్కువ మంది ఒకేసారి రావడం వల్ల కరోనా వ్యాప్తికి ఎక్కువ ఆస్కారం ఉంది ఇప్పటికే పది మంది డీలర్లు ఈ వైరస్ బారినపడి కన్నుమూశారని తెలిసి బాధ కలిగింది. డీలర్లకు కమిషన్ మొత్తాలు ఎప్పటికప్పుడు చెల్లించడంతో పాటు వారందరికీ కరోనా బీమా సౌకర్యాన్ని అమలులోకి తీసుకు రావాలి. అని బాడిశ మురళీకృష్ణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జనసేన అధినేత శ్రీ పవన్ కళ్యాణ్ గారి సూచనల మేరకు మేము ప్రజల సమస్యల మీద నిరంతరం పోరాడుతూనే ఉంటామని బాడిశ మురళీకృష్ణ చెప్పారు.

## సాలూరు పట్టణ వ్యాపారస్తులకు అండగా నిలిస్తాం : జనసేన

సాలూరు ( జనస్వరం ) : కరోనా కారణంగా విజయనగరం జిల్లా సాలూరు నియోజకవర్గం, సాలూరు పట్టణంలో గడచిన 4 నెలలుగా లక్డౌన్ ల కారణంగా ఇబ్బందులు పడుతున్న అన్ని రకాల వ్యాపారస్తులు పడుతున్న కష్టాలు వారి ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని స్థానిక ప్రజాప్రతినిధి శ్రీ రాజన్నదొర గారికి జనసేన తరుపున వినతి పత్రం సమర్పించారు. ప్రభుత్వం తరపున వారు సానుకూలంగా స్పందించి అధికారులతో సంప్రదించి వ్యాపారస్తులు సమస్య తీరుస్తాము అని హామీ ఇచ్చారు. ఊరిలో విపరీతంగా కేసులు పేరుగుతున్న దృష్ట్యా ఒకవేళ లాక్డౌన్ మరికొన్ని రోజులు పెరిగే అవకాశం ఉంటే ఇప్పటికే కుదేలు అయిన వ్యాపారస్తులకు ప్రభుత్వం ద్వారా బ్యాంకుల నుండి వడ్డీలేని అప్పులు ఇచ్చే ప్రయత్నాలు చేసి ఇప్పటికే అన్ని రకాలుగా కష్టాల్లో ఉన్న వ్యాపారస్తులకు చేయూతనివ్వాలి అని డిమాండ్ చేశారు. నెలల తరబడి షాపులు మూసుకుంటు ఉంటే వారి బ్రతుకు ఏలా అని ప్రభుత్వ సంస్థలకు మద్యం దుకాణాలకు ఇచ్చినట్లుగానే వ్యాపారస్తులకు కూడా మినహాయింపులు ఇచ్చి వారిని కూడా ఆదుకోవాలి అని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పట్టణ నాయకులు రేగు మహేశ్వర రావు ,శివకృష్ణ ,పరశురాం తదితరులు పాల్గొన్నారు.

## రైల్వేకోడూరులో ఐసోలేషన్ సెంటర్ ని ఏర్పాటు చేయాలి : జనసేన డిమాండ్

రైల్వే కోడూరు ( జనస్వరం ) : కడప జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గం మరియు మండల, పట్టణ పరిధిలో గడిచిన నెల రోజుల్లో కరోనా వైరస్ విజృంభిస్తున్న విషయం ప్రతి ఒక్కరికి తెలిసిందే. రైల్వే కోడూరు జనసేన పార్టీ నాయకుడు ఆంకిపల్లి అఖిల్ ఒక సమావేశంలో మాట్లాడుతూ రైల్వేకోడూరు మండల పరిధిలోని కరోనా పాజిటివ్ వచ్చిన వ్యక్తులు చాలా ఇబ్బందులు పడుతున్నారని, అలాగే కరోనా లక్షణాలు ఉన్న వారిని కూడా సంబంధిత అధికారులు చేసేదేమీ లేక స్వాబ్ టెస్ట్ నిర్వహించి పాజిటివ్ అని నిర్ధారణ అయితే ఇంటినుండి ఇ కడప ఐసోలేషన్ సెంటర్ కు తరలించడం జరుగుతుందని, ఈ విధంగా చేయడం వల్ల ముందుగానే కరోనా లక్షణాలు ఉంటే వారి కుటుంబంలో ప్రతి ఒక్కరికి సోకి వారు కూడా కరోనా బారిన పడిన వారు అవుతారని అలా కాకుండా రైల్వేకోడూరు లోనే ప్రభుత్వ డిగ్రీ కళాశాల మరియు చాలా చోట్ల ప్రభుత్వ భవనాలు నిరుపయోగంగా ఉన్నాయని ఐసోలేషన్ సెంటర్ ఏర్పాటు చేసి కరోనా బాధితులను కడప లేదా తిరుపతికి తరలించకుండా మెరుగైన వైద్యం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ తరఫున రైల్వేకోడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాస్ గారికి విన్నవించుకుంటూ, ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాము. రైల్వేకోడూరు నియోజకవర్గంలో ఐసోలేషన్ సెంటర్ ను ఏర్పాటు చేసే విషయంపై సత్వరమే సంబంధిత అధికారులు మరియు ప్రజా ప్రతినిధులు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ నాయకుడు అఖిల్ తెలియజేశారు

## కరోనా బారిన పడకుండా ఉండేందుకు తమ గ్రామాన్ని శానిటైజేషన్ చేసిన జనసైనికులు.

( మొదటి పేజీ తరువాయి )

ముందుకు వచ్చారు. జనసైనికులే స్వతహాగా ముందుకు వచ్చి వారే గ్రామాన్ని మొత్తం శానిటైజేషన్ చేశారు. గ్రామంలో ఏం సమస్య వచ్చినా పోరాడటానికి జనసేన పార్టీ ముందుంటుందని గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. గ్రామంలో ప్రతి ఒక్కరూ తప్పని సరిగా మాస్కులు ధరించాలని, సామాజిక దూరం పాటించాలని, అలాగే శానిటైజర్ వాడాలని గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు దమ్మవలం వెంకయ్య , సైదారావు, జనసైనికులు నాగభూషణం, ముకుంద రామంజి, విష్ణు రంగ, బాబురి సాయి, నత్తనేలు, మద్దల కోటయ్య, బాదినేని సుబ్బయ్య, పసుపులేటి అంజి, వెంకీ తదితరులు పాల్గొన్నారు.

## సోము వీర్రాజు గారిని మర్యాద పూర్వకంగా కలసిన జనసేన నాయకులు



న్యూస్ (జనస్వరం): భారతీయ జనతా పార్టీ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు గా నియమితులైన శాసనమండలి సభ్యులు శ్రీ సోము వీర్రాజు గారిని రామచంద్రపురం నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ శ్రీ పోలిశెట్టి చంద్ర శేఖర్ గారు మరియు జనసేన పార్టీ PAC సభ్యులు పంతం నానాజీ గారు, కందుల దుర్గేష్ గారు, పితాని బాలకృష్ణ గారు మరియు తూర్పు గోదావరి జిల్లా జనసేన నియోజకవర్గ ఇంచార్జ్ లు మరియు రామచంద్రపురం జనసేన నాయకులు బుంగా రాజు గారు తదితర జనసైనికులు ఆయనను కలసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేసారు. భవిష్యత్తులో జనసేన పార్టీ మరియు బీజేపీ పార్టీలు కలసికట్టుగా ప్రజల సమస్యలపై పోరాటం చేయాలని అలాగే పార్టీ నిర్మాణంపై దృష్టి పెట్టాలని జనసేన నాయకులు కోరారు.

## జనసేన ప్రెస్ నోట్స్

### వైద్యులకు, నర్సులకు పి.పి.ఈ కిట్లు... కనీసం గ్లౌసులు కూడా ఇవ్వకపోతే ఎలా?

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో రోజురోజుకి కరోనా కేసులు పదివేలకు పైగానే నమోదు అవ్వడం బాధాకరమని పవన్ కళ్యాణ్ గారు అన్నారు. ఇప్పటికీ లక్షకు పైగా కేసులు ఉండడం మనం చూస్తున్నాం. ఈ కరోనా విపత్కర సమయంలో ఆసుపత్రుల్లో కనీసం మౌలిక సదుపాయాలు కూడా ఏర్పాటు చేయకపోవడం బాధాకరం. ప్రాణాలకు తెగించి వైద్య సేవలు చేస్తున్న వైద్య సిబ్బందికి అవసరమైన రక్షణ పరికరాలు, దుస్తులు ఇవ్వకపోవడం చాలా బాధ కలిగిస్తోంది. ఫ్రంట్ లైన్ వారియర్స్ కు అవసరమైన పి.పి.ఈ కిట్లు, రక్షణ దుస్తులు, గ్లౌసులు సమకూర్చలేని స్థితిలో రాష్ట్ర పరిస్థితి ఉండడం మన దౌర్భాగ్యం. తెనాలి కోవిడ్ ఆసుపత్రిలో నర్సింగ్ సిబ్బంది వెల్లడించిన ఆవేదన బాధ కలిగించింది. పి.పి.ఈ కిట్లు, రక్షణ దుస్తులు, గ్లౌసులు సొంత డబ్బులతో కొనుగోలు చేసుకుంటున్నారని తెలిసింది. ఓ వైపు రోగుల సంఖ్య పెరుగుతోంది, అందుకు తగ్గ సిబ్బందిని నియమించకపోవడం ప్రభుత్వ వైఫల్యం తెలుస్తోంది. ఉన్న సిబ్బందిని కూడా సరిగ్గా వినియోగించుకోలేక, కొత్త సిబ్బందిని నియమించక వారి ప్రాణాల మీదకు తెస్తున్నది ఈ ప్రభుత్వం. కరోనా మొదలైనప్పటి నుంచి వైద్య సిబ్బందికి తగిన రక్షణ కిట్లు అందించాలని డిమాండ్ చేస్తూనే వున్నా, ప్రభుత్వం పెడచెవిన పెడుతోంది. గతంలో ఇలా కిట్లు అడిగిన వారిని విశాఖపట్నంలో ఎటువంటి సంఘటనలు జరిగాయో చూసాం.

రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆక్సిజన్ కొరత ఏర్పడటం వాస్తవమా కాదా? రాజమండ్రి ఆసుపత్రిలోని ఒక జర్నలిస్ట్ ఆక్సిజన్ కొరతతో మరణించడం, అలాగే తిరుపతిలో ఒక టీటీడీ ఉద్యోగి కూడా ఆక్సిజన్ కొరతతో మరణించాడని తెలిసి బాధేసింది. ఆక్సిజన్ కొరత ఉన్న విషయంపై ప్రభుత్వం స్పందించాలి. కోవిడ్ విధుల్లో ఉన్న హౌస్ సర్జన్లకు, రెసిడెంట్ డాక్టర్లకు నాలుగు నెలలుగా స్టైఫండ్ కూడా ఇవ్వని పరిస్థితి జనసేన పార్టీ దృష్టికి వచ్చింది. వారికి రక్షణ కిట్లు ఇవ్వకపోయినా, మౌలిక వసతులు కల్పించకపోయినా వైద్య సేవలు చేస్తున్న వైద్యులకు స్టైఫండ్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని జనసేన పార్టీ అధినేత శ్రీ పవన్ కళ్యాణ్ గారు విజ్ఞప్తి చేశారు.

### రేషన్ డీలర్ల బకాయిలు తక్షణమే చెల్లించాలి

పేద ప్రజలకు అవసరమైన బియ్యం, పప్పు ఇతర నిత్యావసర సరుకులను పంపిణీ చేసే రేషన్ డీలర్ల విజ్ఞాలపై ప్రభుత్వం స్పందించకపోతే అంతిమంగా 2కోట్ల 80 లక్షల మంది పేద ప్రజలు ఇబ్బంది పడే పరిస్థితి వస్తుందని పవన్ కళ్యాణ్ గారు హెచ్చరించారు. లాక్ డౌన్ కాలం నుంచి ఇప్పటి వరకూ రేషన్ సరుకు పంపిణీ చేసినందుకు కమీషన్ చెల్లించకపోవడంతో రేషన్ డీలర్లు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర రేషన్ డీలర్ల సంఘం మా దృష్టికి తీసుకొచ్చింది. 29 వేల డీలర్లకు గత ఎనిమిది విడతలకు సంబంధించి సుమారుగా రూ. 160 కోట్ల మేర చెల్లించాల్సి ఉంది. ఆ మొత్తం కమీషన్ రాకపోవడంతో రేషన్ డీలర్లు ఇబ్బంది పడుతున్నారన్నారు. తమ వద్ద ఉన్న సహాయకులకు, కూలీల జీతాలు, షాపు అద్దెలు కట్టాలని ఆవేదని చెందుతున్నారు. డీలర్లకు చెల్లించాల్సిన మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. రేషన్ తీసుకునే సమయంలో సరుకుల కోసం బయోమెట్రిక్ వేయాల్సి ఉంటుంది. కరోనా వైరస్ వ్యాప్తి అధికంగా ఉన్న తరుణంలో ఈ బయోమెట్రిక్ పద్ధతి శ్రేయస్కరం కాదన్నారు. అలాగే ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా బయోమెట్రిక్ సారి కాదని సూచించారు. రేషన్ కోసం ఉపయోగించే బయోమెట్రిక్ విధానం, సరుకుల కోసం ఎక్కువ మంది రావడం కూడా కరోనా వ్యాప్తికి మరింత దోహదపడే అవకాశం ఉంది. ఇప్పటి వరకూ 10మంది రేషన్ డీలర్లు కరోనా వైరస్ బారిన పడి మరణించడం బాధాకరం. డీలర్లకు కమీషన్ మొత్తాన్ని ఎప్పటికప్పుడు చెల్లించడంతో పాటు, వారికి కరోనా భీమా సౌకర్యాన్ని కల్పించాలని జనసేన అధినేత శ్రీ పవన్ కళ్యాణ్ గారు కోరారు .

### ప్రభుత్వం ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటే బాధితులకు జనసేన అండ

ప్రజలకు అవసరమైన సంక్షేమ పథకాలు అందిస్తూ, వారి ప్రయోజనాలను పరిరక్షించాల్సిన ప్రభుత్వం నిర్వీర్యం చేస్తే సగటు పౌరునికి న్యాయం జరిగే పరిస్థితి కనిపించదు. జనసేన అధినేత శ్రీ పవన్ కళ్యాణ్ గారు న్యాయవాదులతో వీడియో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమలో జనసేన నాయకుడు శ్రీ నాదెండ్ల మనోహర్ కూడా పాల్గొనడం జరిగింది. ఈ మీటింగ్ దాదాపుగా 4 గంటల పాటు సుదీర్ఘంగా సాగింది.ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వంపై కోర్టులు ఇచ్చిన తీర్పులను, వెలువరించిన అభిప్రాయాలను, న్యాయస్థానాలపై అసత్య ఆరోపణలు చేసిన వారి గురించి, ప్రభుత్వానికి వ్యతిరేఖంగా సామాజిక మాధ్యమాల్లో మాట్లాడిన వారిపై పోలీసు వేధింపుల చర్యల గురించి చర్చించడం జరిగింది. కొందరు అధికారులు పార్టీ కార్యకర్తల్లాగా మారిపోయి అధికార పార్టీకి కొమ్ము కాసేలా పని చేస్తుంటే ప్రజలకు సరైనా న్యాయం లభించలేదని వారు వివరించారు.

**మంచి చేసేవారు మాటలు పడాల్సి వస్తోంది.**

పాలనా వ్యవస్థ నుంచి అన్నీ అర్హతలు ఉండి కూడా న్యాయం జరగని వారికి అండగా నిలబడదాం. పార్టీ కోసం పని చేస్తూ ప్రభుత్వ ఒత్తిళ్లతో అక్రమ కేసుల్లో బనాయించిన వారికి అండగా ఉందాం. జనసేన పార్టీ లీగల్ సెల్ ను మరింత బలపర్చాల్సిన అవసరం ఉందని చెప్పారు. ప్రభుత్వం చేసే తప్పుల్ని మనం ఎత్తి చూపుతున్నప్పుడు మనల్ని అధికార, ప్రతిపక్షాలు మనల్ని నిందిస్తున్నా మన పని మనం చేసుకుంటూ వెళ్దాం.

**న్యాయవాదులకు అండగా ఉంటాం.**

సహజ న్యాయ సూత్రాలను కాపాడుతూ, చట్ట విరుద్ధంగా ఎవరు వ్యవహరించినా నిలువరించే పరిజ్ఞానం ఉన్న న్యాయ వ్యవస్థ ఎంతో కీలకం. ఈ కరోనా మహమ్మారి వల్ల కొందరు న్యాయవాదులు కూడా మృతి చెందారని తెలిసి బాధపడ్డాను. న్యాయవాదులకు కూడా కరోనా భీమా సౌకర్యం కల్పించాలి. అలాగే కోర్టుల్లో కూడా ఆన్లైన్లో పిటీషన్ తీసుకుంటున్నారనే విషయం నా దృష్టికి వచ్చింది. ఇంకా పౌరులకు అంతా సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో లేనందున నేరుగా కూడా పిటీషన్లు తీసుకునే విధానాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

**న్యాయస్థానం తీర్పులపై గౌరవం లేదు.**

రాష్ట్ర ఉన్నత హైకోర్టు సుమారుగా 68 కేసుల్లో రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలను కొట్టి వేయడమో, నిలువరించడమో చేస్తూ తీర్పులు ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం చట్టాలకి విరుద్ధంగా లేక వ్యతిరేఖంగా చేయడం వల్ల ఉన్నత హైకోర్టు మరియు సుప్రీం కోర్టులు తీర్పులు ఇవ్వడం చూశాం. పార్టీ ఒత్తిళ్లకు అధికారులు కూడా నిబంధనలకు విరుద్ధంగా పని చేస్తున్నారు. పోలీసు, రెవెన్యూ ఇంకా చాలా వ్యవస్థలు అధికార పార్టీకి అనుకూలంగా పని చేస్తున్నాయి. తీర్పులను ఇచ్చిన ఉన్నత న్యాయవాదులను సామాజిక మాధ్యమాల్లో అసభ్య పదజాలంతో పోస్టులు పెట్టడం కూడా చూస్తున్నాం. త్వరలోనే ఒక బలమైన లీగల్ సెల్ ఏర్పాటు చేస్తామని న్యాయవాదులకు జనసేన అధినేత శ్రీ పవన్ కళ్యాణ్ గారు హామీ ఇచ్చారు .

### కురిచేడు మరణాలపై సమగ్ర విచారణ చేపట్టి కారణాలు వెలికి తీయాలి

మద్యం నిషేధిస్తామని హామీ ఇచ్చి, ఇపుడు రాష్ట్రంలో నాటుసారా ఏరులై పారుతున్నా కూడా రాష్ట్రం ప్రభుత్వం పట్టించుకోకుండా నిద్రావస్థలో ఉంది. ప్రకాశం జిల్లా కురిచేడులో మద్యం బదులు శానిటైజర్ తాగి 9 మంది మృత్యువాత పడ్డారని తెలిసింది. మత్తు కోసం నాటుసారా, శానిటైజర్ కలుపుకొని తాగారని క్షేత్ర స్థాయి నుంచి సమాచారం అందుతోంది. ఈ మరణాలపై సమగ్ర విచారణ చేపట్టాలి. కురిచేడులో చనిపోయిన వారిలో చాలా పేద కుటుంబాలు ఉన్నాయి. వారికి ప్రభుత్వం తగిన సహాయం చేయాలి. అలాగే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారికి మెరుగైన వైద్యం అందించాలి. రాష్ట్రంలో నాటుసారకు అడ్డూఅదుపూ లేకుండా పోయిందని, వాటిని అధికార పార్టీ ఎమ్మెల్యేలే నిర్వహించడం బాధాకరం. నాటుసారకు అలవాటుపడ్డ వాళ్ళు, ఆరోగ్యాలు చెడగొట్టుకుంటున్నారని మహిళలు ఆవేదన చెందుతున్నారు. నాటుసారాను అరికట్టడంలో ప్రభుత్వం విఫలం అయిందని అన్నారు. అలాగే మద్యపాన నిషేధం చేస్తామని చెప్పి ఇపుడు మద్యం షాపులు ఇంకా ఒక గంట ఎక్కువ సేపు తెరచుకోవడానికి అనుమతి ఇవ్వడం చూస్తుంటే రాష్ట్ర ప్రభుత్వానికి మద్యపాన నిషేధం మీద చిత్త శుద్ధి లేదని జనసేన అధినేత శ్రీ పవన్ కళ్యాణ్ గారు అన్నారు.

### షిప్ యార్డులో ప్రమాదం దిగ్భ్రాంతికరం

విశాఖపట్నంలోని హిందూస్థాన్ షిప్ యార్డులో భారీ క్రేన్ కూలి 11 మంది మృత్యువాత పడ్డారని తెలిసి బాధపడ్డాను. మృతుల కుటుంబాలకు నా తరపున, జనసేన పార్టీ తరుపున ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. ఇందులో ఎక్కువ మంది కాంట్రాక్ట్ కార్మికులు ఉన్నట్లు తెలిసింది. మృతుల కుటుంబాలను ఆర్థికంగా అన్నీ విధాలా ఆదుకోవాలి. షిప్ యార్డు సంస్థ మృతుల కుటుంబంలో ఒకరికి పర్మినెంట్ ఉద్యోగం కల్పించాలి. ఆసుపత్రులలో ఉన్న క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి. ఈ మధ్య విశాఖలో భారీ ప్రమాదాలు చోటు చేసుకోవడం చూస్తున్నాం. భారీ క్రేన్స్ లాంటి యంత్ర సామాగ్రి ఉన్న చోట రక్షణ ఏర్పాట్లు లేకపోవడం బాధాకరం. ఈ భారీ క్రేన్ నిర్వహణలో ప్రేవేట్ వ్యక్తులకి అప్పగించడం, వారు నైపుణ్యం లేని వారిని నియమించుకోవడం మూలంగానే ఈ ఘటన జరిగిందని వాదనలు వినిపిస్తున్నాయి. వరుస ప్రమాదాలు చోటు చేసుకుంటున్నందున అన్ని పరిశ్రమలు, సంస్థల్లో సేఫ్టీ ఆడిట్లు యుద్ధ ప్రాతిపదికన నిర్వహించాలని కోరుతున్నాను అని ప్రభుత్వానికి శ్రీ పవన్ కళ్యాణ్ గారు తెలియజేశారు.

## జనసైనిక్ పంచ్

- శ్రీనివాస్ కుసుంపూడి (జనసేన పార్టీ అధికార ప్రతినిధి)

వారసత్వం, రౌడీయిజం, అక్రమాస్తులు, వెన్నుపోట్లు, డబ్బు, కులం, మతం తదితర అంశాలు కాకుండా.. ప్రజాసేవ, ప్రజల పట్ల ప్రేమ, వ్యవస్థల పట్ల అవగాహన, దానధర్మాలు, గుప్తదానాలే పాలనకు ప్రాతిపదిక అయితే పవన్ కళ్యాణ్ గారు రాష్ట్రానికి 'శాశ్వత ముఖ్యమంత్రి'.

పాతతరం భుజాల మీద నిలబడి ఉంటుంది కాబట్టి... గత తరంకంటే ఈ తరం ఎప్పుడూ తెలివితేటల్లో మిన్నగానే ఉంటుంది. కానీ తగిన అవగాహన, ముందుచూపు కలిగిన నాయకత్వ లక్షణాలు లేకపోతే మాత్రం పాతతరం కంటే కూడా వెనుకబడి పోతుంది. బుద్ధిజం వారి బుద్ధిని మార్చలేకపోయింది. పైగా కమ్యూనిజం, జింగోయిజంలతో పాటు ఇతరులు నాశనం అయిపోయినా ఫర్వాలేదు మేము మాత్రం బాగుండాలి అనే 'శాడిజం' చైనా వారికి ఎక్కువ.వారిని ఎదుర్కోవాలంటే మనకి నేషనలిజం(జాతీయవాదం)తో పాటు పేట్రియాటిజం(దేశభక్తి) కూడా చాలా ముఖ్యం.

### శ్రీ సోము వీర్రాజు గారికి శుభాకాంక్షలు

భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ శాఖ అధ్యక్షులుగా నియమితులైన శాసనమండలి సభ్యులు శ్రీ సోము వీర్రాజు గారికి జనసేన పార్టీ తరుపున శ్రీ పవన్ కళ్యాణ్ గారు శుభాకాంక్షలు తెలిపారు. రాజకీయంగా ఎంతో అనుభవం , పుష్కలమైన నాయకత్వపు లక్షణాలు, సేవ తత్పరత కలిగిన శ్రీ వీర్రాజు గారు నాయకత్వంలో బీజేపీ ఆంధ్రప్రదేశ్ లో మరిన్ని విజయాలను సాధించాలని పవన్ కళ్యాణ్ గారు కోరుకున్నారు. విద్యార్ధి ఉద్యమాల నుంచి వచ్చిన శ్రీ వీర్రాజు గారికి క్షేత్ర స్థాయిలో పేద వర్గాల సమస్యలపై ఎంతో అవగాహన ఉంది. ప్రజా సమస్యల పరిష్కారంలో మీతో కలసి ముందుకు సాగుతామని మనస్ఫూర్తిగా తెలియజేస్తున్నానై పవన్ కళ్యాణ్ గారు తెలియజేశారు .

## దహన సంస్కారాలు చేసి మానవత్వాన్ని చాటుకున్న జనసైనికులు

( మొదటి పేజీ తరువాయి )

జనసేన అధినేత శ్రీ పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో జనసైనికులు తమ మానవత్వాన్ని చాటుకుంటున్నారు. వివరాల్లోకి వెళ్తే కృష్ణా జిల్లా గుడివాడ పట్టణంలో ఓ మానసిక వికలాంగురాలు అయిన వృద్ధురాలు మృత్యువాత పడ్డారు. ఆమెకు దహన సంస్కారాలు నిర్వహించేందుకు కుటుంబ సభ్యులు సైతం ముందుకు రాలేదు. విషయం తెలుసుకున్న గుడివాడ జనసైనికుడు మాచర్ల రామకృష్ణ(ఆర్కే) తన బృందంతో కలిసి ఆమెకు అంతిమ సంస్కారాలు నిర్వహించారు. మానవత్వం ఉనికి కోల్పోతున్న పరిస్థితుల్లో ఆ వృద్ధురాలికి జనసైనికులే ఆ నలుగురై పాడె మోసి, అంత్యక్రియలు చేయడం పట్ల సర్వత్ర ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. జనసైనికుడు మాచర్ల రామకృష్ణ(ఆర్కే) మాట్లాడుతూ ఎవరికి ఏం కష్టం వచ్చినా ఆదుకోవడానికి మా జనసైనికులు ముందు ఉంటారని, జనసేన అధినేత శ్రీ పవన్ కళ్యాణ్ గారి ఆశయ సాధనలో నడుస్తూ మానవత్వాన్ని కాపాడుతామని చెప్పారు.

## " జనసేన బ్లడ్ డోనర్స్ " ప్రథమ వార్షిక శుభాకాంక్షలు : జనసైనికులు

పార్వతీపురం ( జనస్వరం ) : “జనసేన బ్లడ్ డోనర్స్” నేటికి సంవత్సరం గడిచిన సందర్భంగా వంగలపుడి నాని మరియు మానేపల్లి ప్రవీణ్ కు జనసేన పార్టీ తరుపున అభినందనలు తెలియజేశారు. ఈ సంవత్సర కాలంలో వీరు చేసిన సేవలు మరువలేనివి. సుమారు 500 లకు పైగానే దాతల చేత ‘జనసేన బ్లడ్ డోనర్స్’ ఆధ్వర్యంలో వీరు డొనేట్ చేయించడం అనేది సాధారణ విషయం కాదు. ప్రతి జనసైనికుడు గర్వంగా చెప్పుకోదగ్గ విషయం... వీరు ఈ విధంగానే రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చెయ్యాలని, చాలా మందికి మీరు ఆదర్శంగా నిలవాలని జనసేన పార్టీ పార్వతీపురం నియోజకవర్గం తరుపున కోరుకుంటూ చిరు సత్కారం చెయ్యడం జరిగింది... ఈ కార్యక్రమంలో ముఖ్య కార్యకర్తలు చందక అనీల్, నెయ్యిగాపుల సురేష్, విజయ్, చైతన్య, మురారి పాల్గొన్నారు.

## నిరుపయోగంగా ఉన్న బస్టాండ్ ను ప్రజల సౌకర్యార్థం వాడుకోవాలని జనసైనికుల వినతి.



జగ్గంపేట (జనస్వరం) : వత్సవాయి మండల పరిధిలో వత్సవాయి స్థానిక గాంధీ పార్క్ సెంటర్ నందు గల RTC బస్టాండ్ అనేది మరీ ఎప్పటినుంచో మండల పరిధిలో, గ్రామంలో ఉన్నప్పటికీ ఎక్కువగా నిరుపయోగంగా ఉంటుంది అని, అసంఘటిత కార్యక్రమాలు ఎక్కువగా జరుగుతున్నాయని, ప్రజల సౌకర్యార్థం కోసం ప్రభుత్వ కార్యకలాపాలకు ఉపయోగించుకోవాలని నియోజకవర్గ నాయకులు ఈమని కిషోర్ కుమార్, కొర్రపాటి గోపీచంద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జనసేన పార్టీ తరుపున స్థానిక మండల డెవలప్మెంట్ ఆఫీసర్ వారికి వినతిపత్రం ఇవ్వటం జరిగింది. ఈ కార్యక్రమంలో కిషోర్ కుమార్ మాట్లాడుతూ RTC వారికి సంబంధించిన ప్రతి బస్సు ప్రజల సౌకర్యార్థం కోసం గాంధీ పార్క్ సెంటర్ లో ఉన్నటువంటి బస్టాండ్ కి వచ్చి ప్రయాణికులకు సహకరించాల్సిన అవసరం ఉందని, కానీ అలా జరగకుండా బస్సులు అన్ని మెయిన్ రోడ్ మీదుగా వెళ్తున్న పరిస్థితి ఉందని, ఏ విధంగా ప్రయాణికులకు ఉపయోగపడని ఈ బస్టాండ్ అనేది కేవలం అసంఘటిత కార్యక్రమాలకి మాత్రం ఉపయోగపడుతుంది అని ఆయన తెలిపారు. మరీ బస్టాండ్ ని ప్రయాణికుల సౌకర్యార్థం కోసం ఉపయోగించుట లేదు కనుక, కరోనా మహమ్మారి కారణంగా ఎక్కువగా బస్సులు కూడా వచ్చే అవకాశం లేనందున, నిరుపయోగంగా ఉన్న బస్టాండ్ ను ప్రభుత్వం వారు కొంచం చొరవ చూపించి “హెల్త్ కేర్ సెంటర్” గానో “ రైతు బజార్ కేంద్రం” గానో లేదా రైతులు రైతులకి సంబంధించినంతవరకు పత్తి విత్తనాల్ని ప్రభుత్వం వారే కొనుగోలు చేసే కేంద్రంగా లేదా ప్రభుత్వ ఆఫీసులకు కూడా ఏర్పాటుచేసుకోవచ్చు అని ప్రభుత్వం వారిని కోరుతున్నామని ఆయన తెలిపారు. ఇన్ని రకాలుగా ఉపయోగకరంగా ఉన్న ఈ బస్టాండ్ ని దయచేసి ప్రభుత్వం వారు అసంఘటిత కార్యక్రమాలు జరగకుండా చూసి, ఏదో ఒక రకంగా ప్రజల సౌకర్యార్థం కొరకు ఉపయోగించులోవాలని, జనసేన పార్టీ తరుపున మేము కోరుచున్నాము ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాషా, మహేష్, త్రిశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## కోవిడ్ ఆసుపత్రిలో మౌలిక సదుపాయాలు కల్పించాలి : జనసేన డిమాండ్



పార్వతీపురం ( జనస్వరం ) : కరోన తీవ్రత పెరుతున్నందున కోవిడ్ ఆసుపత్రులు పెంచడంతో పాటు, మౌలిక సదుపాయాలు కల్పించాలని జనసేన పార్వతీపురం ఇంచార్జ్ జి. గౌరీశంకర్ డిమాండ్ చేశారు. సోమవారం సీతానగరంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్వతీపురం డివిజనులో కొత్తగా ఉల్లిభద్రలో ఏర్పాటుచేసిన కోవిడ్ ఆసుపత్రిలో కనీస సౌకర్యాలులేక, సరైన వైద్య సదుపాయాలులేక రోగులఆవేదనను అధికారులు గమనించాలని విజ్ఞప్తి చేసారు. కరోన పేరిట ప్రైవేటు ఆసుపత్రిలలో జరుగుతున్న దోపిడీని ప్రభుత్వం అరికట్టాలని డిమాండ్ చేశారు. తక్షణమే ఆరోగ్యశ్రీ క్రింద కరోనాను చేర్చి మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. దీంతోపాటు అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రతీరోజు కరోనా పరీక్షలు నిర్వహించే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వైద్యులకు, వైద్యసిబ్బంది అందరికి తప్పనిసరిగా పీపీఈ కిట్లుఅందజేయాలని కోరారు.లు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కరోనాతోపాటు సీజనల్ వ్యాధులపై కూడా అధికారులు దృష్టి సారించాలని కోరారు. ఇదిలావుండగా సీతానగరం వంతెన మరమ్మతులు ఇటీవలే చేసినప్పటికీ, వంతెనపైకొత్తగా ఏర్పాటు చేసిన గడ్డరు ఒకటి అకస్మాత్తుగా క్రిందపడి పెను ప్రమాదం తప్పిందని, దీనికి సంబంధించిన అధికారులు సరైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పనుల్లో నాణ్యత లేదని స్పష్టంగా తెలుస్తోందన్నారు. లచ్చయ్యపేట ఎన్.సి. స్ చక్కెరకర్మాగారంలో రైతులకు 10కోట్ల చెరకుబకాయిలు ఇంతవరకు చెల్లింపు చేయకపోవడం వల్ల రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారని చెప్పారు. తక్షణమే రైతుల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పార్వతీపురం ఇంచార్జ్ జి. గౌరీశంకర్ డిమాండ్ మరియు నియోజకవర్గ నాయకులు రెడ్డి కరుణ, చందక అనిల్, సీతానగరం మండలజనసేన నాయకుడు పోతల శివశంకర్ పాల్గొన్నారు.

## ఓ సారూ..! మమ్ముల్ని జర పట్టించుకోండి.

వరంగల్ ( జనస్వరం ) : వరంగల్ అర్బన్ LVR NAGAR కాలనీలో గత 15సంవత్సరాల నుండి 200 కుటుంబాలు నివాసం ఉంటున్నారు. రెండు సంవత్సరాల క్రితం ఇంటి పన్ను కూడా మంజూరు అయింది. అందరు ఇంటి పన్ను కూడా క్రమం తప్పకుండా కడుతున్నారు. కానీ ఈ కాలనీలో ఎటువంటి మౌలిక సదుపాయాలు లేవు. కరెంట్ మీటర్లు, మంచి నీటి నల్లాలు, రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ ఎలాంటి సౌకర్యాలు లేవు, ఇప్పుడు ఆ కాలనీకి బాగా వేధిస్తున్న సమస్య ఏమిటంటే, ఇప్పటికీ మంచినీటి సౌకర్యం లేదు. అప్పుడప్పుడు కాలనీకి తాగునీటి వాటర్ ట్యాంకులు వచ్చేవి. కానీ, ఇప్పుడు వారం రోజుల నుండి ఆ కాలనీకి వాటర్ ట్యాంకర్లు రావడం లేదు. ఈ కరోనా విపత్కర సమయంలో ప్రజలకు త్రాగడానికి నీరు లేక చాలా ఇబ్బంది పడుతున్నారు. చిన్న పిల్లలు, వృద్ధులు ఉండడంతో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. వాటర్ సప్లై అయ్యే ఏరియా చార్జిబాలి దగ్గరికి వెళ్ళి అడిగితే ఏఈ లేదు అని, సదరు అధికారులు చెప్తున్నారు. పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు అందజేసినా ఎలాంటి స్పందన లేదు. ప్రభుత్వం వెంటనే చర్య తీసుకొని తగిన సౌకర్యాలు కల్పించాలని, వీలయినంత తొందరగా సమస్యలు పరిష్కరించాలని LVR NAGAR జనసైనికులు కోరుతున్నారు.

జనస్వరం
అక్షరమే ఆయుధం ✍
www. Janaswaram.com

పాఠకులకు మనవి

జనస్వరం ఈ - వార్తాపత్రిక (వార సంచిక) నందు మీ గళమైన వాణిని వినిపించాలనుకుంటున్నారా? మీ నియోజకవర్గ ప్రాంతంలో జరిగిన సంఘటనలను మన వార్తాపత్రిక నందు పంచుకోవాలనుకుంటున్నారా? మీ సమస్యలను మా పత్రిక నందు విన్నవించుకోవాలని అనుకుంటున్నారా? మీ స్వరంతో ప్రజలకు మరింత చేరువ అవ్వాలంటే మాకు ఈ క్రింది వాటికి పంపించండి.

9642067900

janaswaramnews@gmail.com

జనస్వరం న్యూస్ వెబ్సైట్ మరియు వార్తాపత్రిక మరింత నాణ్యమైన వార్తాప్రపంచాన్ని మీ ముందుకు తీసుకురావడానికి మీ వంతు సహాయంగా ఆర్థికంగా చేదోడుగా నిలవాలని కోరుకుంటున్నాము.

Phonepe/Googlepay

UPI id : janaswaram@ybl